



విద్యుత్ దీపాలతో పసుపనాథేశ్వరస్వామి ఆలయం

ఓం నమశ్శివాయ

నేడు కార్తీక మొదటి సోమవారం

శివాలయాల్లో సోమవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. ఓం నమశ్శివాయ నామంతో ఆలయాలు మార్మోగనున్నాయి. ఇప్పటికే విద్యుత్ దీపాలతో ముస్తాబయ్యాయి. పుణ్యగిరి, విజయనగ రంలోని పలు శివాలయాలు, ఎస్.కోట మండలం ధర్మవరంలోని సన్యాసేశ్వరస్వామి, సారిపల్లి దిబ్బేశ్వరస్వామి, వంగర సంగమేశ్వరస్వామి ఆలయాల్లో శివపూజలు, అభిషేకాలు పెద్దఎత్తున జరుగనున్నాయి.

- విజయనగరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి)

6లో



విజయనగరం: పూజలందుకోనున్న పసుపనాథేశ్వరస్వామి

నదీ స్నానాల వద్ద జాగ్రత్తలు తీసుకోండి

ఎస్పీ వకుల్‌జిందాల్



విజయనగరం క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని జిల్లాలో ఎక్కువ మంది భక్తులు వెళ్లే శివాలయాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించే నదులు, చెరువుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. ఆయా ప్రాంతాలను పోలీసులు పరిశీలించాలని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎక్కువ మంది భక్తులు సముద్ర స్నానాలు ఆచరించే అవకాశం కూడా ఉందని, ఆ ప్రాంతాలను గుర్తించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యువత నదుల్లో లోతైన ప్రాంతానికి వెళ్లకుండా బందోబస్తు, పెట్రోలింగు నిర్వహించాలన్నారు. వన భోజనాలు, పిక్నిక్ నిర్వహించే ప్రాంతాలను కూడా ముందుగా గుర్తించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్, కొట్లాటలు, గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు.

స్థానిక సంస్థల్లో ఎవరి బలమెంత?



- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీపై పెదవి విప్పని కూటమి
- అభ్యర్థి ఎంపికలో తలమునకలైన వైసీపీ
- ఓట్ల బలాబలాల్లో అధిక్యం ఉండడంతో దూకుడు
- అభివృద్ధికి బాటలు వేస్తుండడంతో కూటమి వైపు చూస్తున్న ఓటర్లు

శృంగవరపుకోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):

- వైసీపీకు 418 ఎంపీటీసీలు, 34 జడ్పీటీసీలు, 126 కార్పొరేటర్‌లు, కౌన్సిలర్‌లు, ఒక ఎమ్మెల్సీ కలిపి మొత్తం ఓటర్లు 579 మంది
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి 121 మంది ఎంపిటీసీలు, 34 కార్పొరేటర్‌లు, కౌన్సలర్‌లు, 9మంది ఎమ్మెల్యేలు కలిపి మొత్తం ఓటర్లు 164మంది
- ఒక స్వతంత్ర ఎంపీటీసీ.. వివిధ కారణాలతో 9 చోట్ల ఖాళీలు

- ఇవీ ప్రస్తుతానికి పార్టీల బలబలాలు. స్థానిక సంస్థల కోటాలో జరగనున్న శాసన మండలి ఎన్నికల్లో ఓట్లేసేందుకు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్‌లు, కౌన్సిలర్‌లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు మాత్రమే అర్హత ఉంది. విజయనగరం, పార్వతీపురం ఉమ్మడి జిల్లాలోని ఓటర్ల సంఖ్య 753 కాగా వివిధ కారణాలతో 9 ఖాళీగా ఉండడంతో 744 ఓట్లు వున్నాయి. వీరిలో ఎవరికి ఎక్కువ ఓట్లు పడితే ఆ పార్టీకి చెందిన అభ్యర్థి ఎమ్మెల్సీగా ఎన్నికవుతారు. ప్రస్తుతానికి పార్టీల పరంగా ఓట్లను చూస్తే వైసీపీకి, కూటమి కంటే 415 ఓట్లు అధికంగా ఉన్నాయి. దీంతో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే తరువాత అభ్యర్థి ఎంపికలో వైసీపీ తలమునకలైంది. ఆ పార్టీకి జిల్లాకు పెద్ద దిక్కుగా వున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కసరత్తు మొదలెట్టేశారు. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీని తిరిగి దక్కించుకొనేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఐదు నెలల క్రితం వరకు ఎమ్మెల్సీగా వ్యవహరించిన ఇందుకూరి రఘురాజు వైసీపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఇతని భార్య టీడీపీలో చేరడం, వైసీపీతో ఇతనికి ఏర్పడిన విభేదాల కారణంగా అనర్హత వేటు వేసే వరకు పరిస్థితి వెళ్లింది. ఖాళీగా అయిన స్థానాన్ని తిరిగి పొందేందుకు అన్నిరకాల సమర్థుడైన అభ్యర్థిని నిలబెట్టేందుకు అదివారం వైసీపీ పెద్దలు సమాలోచనలు చేశారు. విజయనగరం మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావులు బొత్స, చిన్నశ్రీనును కలిసి మాట్లాడినట్లు సమాచారం. సాలూరు మాజీ ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర పేరును పరిశీలిస్తున్నట్లు మిగతా 8వ పేజీలో...

విద్యార్థులకు అపార్ కష్టాలు

- తప్పులతో ఆధార్ వివరాలు
- పూర్తిస్థాయిలో లేని ఆధార్ నమోదు కేంద్రాలు



విజయనగరం కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపార్ కార్డుల నమోదు ప్రక్రియతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆధార్ కేంద్రాలు అంతంత మాత్రంగా ఉండడంతో గంటల కొద్దీ నిరీక్షించి ఆపై నమోదు కాక నరకయాతన పడుతున్నారు. ప్రధానంగా గతంలో నమోదు చేసిన ఆధార్‌లో తప్పులు ఉండడంతో ఇప్పుడు విద్యార్థులకు కష్టాలు వచ్చాయి.

జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికీ అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అథంటిక్ రిజిస్ట్రీ) సంఖ్య అందించేందుకు కేంద్రం నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి డిగ్రీ వరకూ చదువుతున్న విద్యార్థులకు అపార్ నమోదు జరుగుతోంది. ప్రతి విద్యార్థికీ స్కూల్‌లో ఉన్న వివరాలు, ఆధార్‌లో ఉన్న వివరాలు ఒకేలా ఉండాలి. ఇలా ఉన్నవారికి సమస్య లేదు. కాని చాలా మంది విద్యార్థులకు పాఠశాలలో ఒక విధంగా వివరాలు ఉంటే ఆధార్‌లో మరోలా ఉన్నాయి. ఇటువంటి వారికి మాత్రమే సమస్య వచ్చింది. ఈ సమస్య ఉన్న వారంతా ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లి సవరించుకున్న తరువాత అపార్‌లో నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే జిల్లాలో ఆధార్ కేంద్రాలు కొన్నే ఉన్నాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆయా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఆధార్‌లో నమోదు చేసిన తరువాత అప్‌డేట్ కావడానికి సుమారు 10 నుంచి 15 రోజులు పడుతుంది. విద్యార్థికి ఆధార్‌లో ఇంటి పేరు, పుట్టిన తేదీ ఒకేలా ఉండాలి. ఇది సక్రమంగా లేకపోతే సవరించుకోవాలి. ప్రభుత్వం ఇచ్చిన గడువు దాటిపోయే అవకాశాలు ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఒకసారి అపార్ కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తయి, ఉద్యోగం సాధించే వరకూ అదే నెంబరు కార్డు ఉంటుంది. కేంద్రం జారీ చేస్తున్న అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు అందులో నమోదై ఉంటాయి. శాశ్వత డిజి టిల్ గుర్తింపు సంఖ్యతో దేశంలో ఎక్కడ చదవాలన్నా ఉపాధి అవకాశాలకు సంబంధించి కూడా ఈ కార్డు కీలకం కానుంది. జిల్లా వ్యాప్తంగా 2232 పాఠశాలలు ఉన్నాయి. 2,23,935 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటి వరకూ 1,25,519 మంది అపార్ నమోదు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

అధునాతన ఐటీఐ

- బొబ్బిలి ప్రభుత్వ విద్యాలయానికి హంగులు
- డ్రోన్ టెక్నాలజీ కోర్సు మంజూరు
- వర్చువల్ రియాల్టీ ల్యాబ్ ఏర్పాటు
- ఇక్కడ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఐటీఐలకు తరగతులు నిర్వహించే అవకాశం



6లో

సైలెన్సర్ వద్దట

- రేస్ బైకులతో కుర్రకారు బేజారు
- ఇష్టారాజ్యంగా సైలెన్సర్ల వినియోగం
- నిబంధనలకు విరుద్ధం

6లో

తీరని విషాదం

- వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బాలురు మృతి
- తొత్తాడం, కంచరాంలో విషాదం

జిల్లాలో ఆదివారం వేర్వేరు చోట్ల ఇద్దరు బాలురు అకారణంగా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వారి భవిష్యత్‌ను ఎంతో అందంగా ఊహించికున్న కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చారు. విజయనగరం వసతిగృహంలో ఉంటున్న ఏడో తరగతి విద్యార్థి శ్యామలరావు ఉదయం లేచి అందరితో కలివిగా ఉంటూనే ప్రాణాలు వదిలాడు. రాజాం మండలం కంచరాంకు చెందిన భాస్కర్ తోటి స్నేహితులతో స్నానానికి వెళ్లి ఈతరాక మునిగిపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఈ రెండు ఘటనల్లో కుటుంబ సభ్యుల రోదనల్ని చూసిన ప్రతి ఒక్కరూ కన్నీరు పెట్టుకున్నారు.

సరదాగా ఉంటూనే అందని లోకాలకు



శ్యామలరావు(ఫైల్)

విజయనగరం కలెక్టరేట్/ విజయనగరం క్రైం/ రింగురోడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):

పాఠశాలకు సెలవు కావడంతో హాస్టల్ ఉంటున్న ఆ బాలుడు ఆదివారం ఉదయం దుస్తులు ఉతుక్కున్నాడు. ఆ సమయంలో తన స్నేహితులతో సరదాగా మాట్లాడాడు. అందరితో కలిసి టిఫిన్ చేశాడు. కొద్దిసేపటి తరువాత కళ్లు తిరగడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఆందోళన చెందిన మిగతా విద్యార్థులు వెంటనే హాస్టల్ వార్డెన్ జానకీరామ్‌కు చెప్పారు. అందరూ కలిసి ఆటోలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యం అందించడానికి వైద్యులు ఏర్పాట్లు చేసి పరీక్షించగా అప్పటికే శ్యామలరావు ప్రాణాలు కోల్పోయాడు. పూసపాటిరేగ మండలం తొత్తాడాం గ్రామానికి చెందిన కొణతాల శ్యామలరావు(12) విషాదాంతమిది. తండ్రి చినసత్యం ఎప్పటిలాగే ఆదివారం పూసపాటిరేగ మైలాన్ కంపెనీలో విధులకు వెళ్లాడు. ఆ సమయంలో ఈ విషాద వార్త తెలిసి గుండెలవిసేలా రోదించాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్యామలరావు తల్లి సత్యవతి కొన్నాళ్ల కిందట చనిపోయింది. ఆ తరువాత నుంచి పూసపాటిరేగ మండలం తొత్తాడాం గ్రామంలో అమ్మమ్మ గొరుసు రాములమ్మ, తాత ఆసిరి నాయుడు వద్ద ఉంటున్నాడు. వీరిద్దరూ కూలీలుగా ఆ ఊర్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 6వ తరగతి చదువుతున్నప్పుడే విజయనగరంలోని బీసీ వెల్ఫేర్ వసతిగృహంలో శ్యామలరావు చేరాడు. ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్నాడు. ఘటనపై టూటౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విచారణ నిర్వహిస్తున్నారు. ఆదివారం కావడంతో పోస్టుమార్టం ప్రక్రియ ఆలస్యమైంది. సాయంత్రం 4.00 గంటల తరువాత కుటుంబ సభ్యులకు బాలుడి మృతదేహాన్ని అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శ్యామలరావు కుటుంబ సభ్యులను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఘటనపై సమగ్ర నివేదికను రెండు రోజుల్లో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్‌కు అందజేయాలని హాస్టల్ సంక్షేమాధికారికి ఆదేశించారు.



విషాదంలో కుటుంబ సభ్యులు

స్నానానికి వెళ్లి

- చెరువులో మునిగి బాలుడి మృతి



రాజాం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నాన్నా...లేవరా.. లేచి మాట్లాడురా.. అమ్మని రా.. అంటూ కొడుకు మృతదేహంపై పడి బోరున విలపిస్తున్న ఆ తల్లి రోదనతో రాజాం సామాజిక ఆసుపత్రి ఒక్కసారిగా మూగబోయింది. పట్టుమని పదిహేనేళ్లు కూడా లేని ఒక్కగానొక్క కొడుకు స్నేహితులతో కలిసి చెరువుకు స్నానానికి వెళ్లి మునిగిపోయి మృతి చెందాడు. తనయుని అచేతనంగా చూసిన ఆ తల్లిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. కంచరాం గ్రామానికి చెందిన బాలుడు భాస్కర్ (14) విషాదాంతమిది. ఆదివారం సెలవు కావడంతో మరో నలుగురు స్నేహితులతో కలిసి భాస్కర్ రాజయ్యపేట సమీపంలోని చెరువుకి స్నానానికి వెళ్లాడు. అందరితో కలిసి స్నానం చేస్తుండగా ఒక్కసారిగా భాస్కర్ లోపలకు చొచ్చుకుపోయి మునిగిపోయాడు. ఇది గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో చెరువు సమీపంలో ఉన్న వారంతా వచ్చి బాలుడ్ని రక్షించే ప్రయత్నం చేశారు. క్షణాల్లో రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే భాస్కర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భాస్కర్ కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లి కృష్ణవేణి ఓ జూట్ కర్మాగారంలో దినసరి కూలీ. భర్త దుర్గారావు చాలా ఏళ్ల కిందటే మృతిచెందడంతో కొడుకు భాస్కర్‌తో కలిసి కంచరాంలో జీవనం సాగిస్తోంది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు కూడా మృతి చెందడంతో ఆమె వేదన వర్ణనాతీతంగా ఉంది. కంచరాం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాజాం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడేళ్లుగా పోరాటం

- ఆర్‌ఈసీఎస్‌లో ఉద్యోగాల అమ్మకంపై అర్హుల ఆందోళన
- నాడు చేతులు మారిన రూ.7 కోట్లు
- వ్యవహారంపై సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేకు బాధితుల ఫిర్యాదులు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

మెంటాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):

చీపురుపల్లి కేంద్రంగా నడుస్తున్న గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్)లో నాటి నాయకులు సిండికేట్‌గా మారి అర్హులకు దక్కాల్సిన ఉద్యోగాలను వాటాలు పంచుకొని అనర్హులకు అమ్మేసుకున్న వైనంపై అర్హులు మూడేళ్లుగా పోరాడుతున్నారు. 59 ఉద్యోగాలను ఏడు కోట్ల రూపాయలకు అమ్మేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కొందరు వీర విధేయ అధికారుల పాత్రకూడా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. అయితే తమకు జరిగిన అన్యాయంపై బాధిత అభ్యర్థులు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఆశలతో ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. అక్రమ నియామకాలపై విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

చీపురుపల్లి గ్రామీణ విద్యుత్తు సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్)లో 59 ఎనర్జీ అసిస్టెంట్ల ఉద్యోగాల భర్తీకి 2020 ఫిబ్రవరి 20న నోటిఫికేషన్ జారీచేయగా పెద్దసంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అదే ఏడాది సెప్టెంబరులో విజయనగరం దాసన్నపేటలో ఏపిఈపి డీసీఎల్ కార్యాలయం వద్ద వారికి పోల్ క్లయింబింగ్ (విద్యుత్తు స్తంభాలు ఎక్కడం)మీటర్ రీడింగుతోపాటు సైకిలు తొక్కడం వంటివాటిపై పరీక్ష నిర్వహించారు. ఇదంతా అయ్యాక 2021లో అన్నిరకాల పరీక్షల్లో అర్హత సాధించి ఉద్యోగాలకు ఎంపికైన వారి వివరాలు అంటూ అధికారులు విడుదల చేసిన జాబితా అప్పట్లో పెద్ద కలకలమే సృష్టించింది. ఎంపిక చేసిన మొత్తం 59 మంది అర్హతలపై పెద్ద దుమారం చెలరేగింది. మూడొంతుల మంది అనర్హులేనని బాధిత అభ్యర్థులు గగ్గోలు పెట్టారు. వీటిని పట్టించుకోకుండా అధికారులు నియామక పత్రాలు అందజేసేశారు. ఆ తర్వాత కొత్తవారు ఉద్యోగాల్లో చేరిపోవడం కూడా జరిగిపోయింది. నియామకం తీరును వ్యతిరేకిస్తున్న అభ్యర్థులు ఆందోళన బాట పట్టారు. ఆర్‌ఈసీఎస్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేసి నిరసన తెలిపారు.



బాధితుల ఆందోళన (ఫైల్)

ఇలా వెలుగులోకి..

ఏపీఈపీడీసీఎల్‌లో ఓ వ్యక్తి నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందాడంటూ ఆర్.సన్యాసిరావు అనే వ్యక్తి విశాఖలో ఫిర్యాదు చేయగా విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారుల విచారణలో అది రుజువైంది. ఆ వ్యక్తి ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సమీప కాన్పూర్ కేంద్రంగా నడుస్తున్న భారతీయ శిక్షా పరిషత్ అనే సంస్థ పేరుతో నకిలీ సర్టిఫికెట్ సంపాదించి అక్రమంగా ఉద్యోగం పొందినట్టు తేలడంతో అయన్ను గతేడాది మే 12న విధులనుంచి తొలగించారు. పోలీసులు కేసునమోదు చేశారు. అప్పట్లో ఈ ఉదంతం సంచలనమైంది. కాగా అదే ఇనిస్టిట్యూట్ నుంచి పొందిన ఇతర అభ్యర్థుల సర్టిఫికెట్‌లను ఆర్‌ఈసీఎస్ ఉద్యోగులు ఎలా అనుమతించారో అంతుపట్టని ప్రశ్నగా మారింది. ఓ ఉద్యోగి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తరువాత కూడా చర్యలకు ఉపక్రమించకపోవడం మిగతా 8వ పేజీలో...



బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐ

అధునాతన ఐటీఐ


స్టిమ్యులేటర్‌పై డ్రైవింగ్ శిక్షణ

- బొబ్బిలి ప్రభుత్వ విద్యాలయానికి హంగులు
- డ్రోన్ టెక్నాలజీ కోర్సు మంజూరు
- వర్చువల్ రియాల్టీ ల్యాబ్ ఏర్పాటు
- ఇక్కడ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఐటీఐలకు తరగతులు నిర్వహించే అవకాశం
- స్టిమ్యులేటర్‌పై డ్రైవింగ్, వెల్డింగ్ కోర్సులలో శిక్షణ

బొబ్బిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి)

బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐ సరికొత్తగా తయారైంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ అధునాతన వైపు అడుగులు వేస్తోంది. మారిన పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా వినూత్న మార్పులు చేస్తోంది. డ్రోన్ టెక్నాలజీ కోర్సు మంజూరు కావడం.. వర్చువల్ రియాల్టీ ల్యాబ్ ఏర్పాటు చేయడం.. స్టిమ్యులేటర్‌పై డ్రైవింగ్, వెల్డింగ్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవడం తదితర పరిణామాలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. కొత్తతరం బొబ్బిలి ఐటీఐలో చేరేందుకు ఆసక్తి చూపుతోంది.

1960 సంవత్సరంలో స్థానిక సంస్థానం హైస్కూలులో ప్రారంభమైన బొబ్బిలి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)కు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరు ప్రఖ్యాతులు ఉండేవి. చాలా ఏళ్లు పాతపద్ధతులతోనే బోధన, శిక్షణ ఉండేది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ సంస్థ కూడా మారింది. కొత్త హంగులను అద్దుకుని వినూత్న కోర్సులను ప్రవేశపెట్టింది. ఏపీ టెక్నికల్ సర్వీసెస్ సంస్థ కోటిన్నర రూపాయలతో నూతన పరికరాలను సమకూర్చింది.

- వర్చువల్ రియాల్టీ (వీఆర్) ల్యాబ్, ఎలక్ట్రానిక్ మెకానిక్ స్టిమ్యులేషన్, ఆగ్మెంట్ రియాల్టీ (ఏఆర్) ల్యాబ్‌లు మంజూరయ్యాయి. వీఆర్ ల్యాబ్ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఐటీఐలకు నేరుగా ప్రత్యక్షంగా టెలికాస్ట్ అయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ బోధిస్తున్న అంశాలను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన ఐటీఐల విద్యార్థులు నేర్చుకునేందుకు ఈ వీఆర్ ల్యాబ్‌లు ఎంతగానో దోహదపడతాయి.
- 40 మందికి శిక్షణ ఇచ్చేలా కంప్యూటర్ కోర్సు ప్రవేశపెట్టేందుకు డిసెంబరు నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. షూయింగ్ టెక్నాలజీ కోర్సును కూడా తీసుకొస్తున్నారు. డ్రోన్ టెక్నాలజీ, ఏసీ మెకానిజమ్ కోర్సులకు అనుమతి లభించింది. కాలం చెల్లిన పరికరాల స్థానంలో కొత్త పరికరాలను సమకూర్చారు.
- డ్రైవింగ్ స్టిమ్యులేటర్ సహాయంతో డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ప్రమాదాలను నివారించే విధంగా ముందుగా స్క్రీన్, ప్రొజెక్టరు ఉపయోగించి ప్రాథమికంగా శిక్షణ ఇస్తారు. సీటు బెల్ట్, గేర్లు మార్చడం వంటివి వాహనం లేకుండానే పరోక్షంగా వాహనాన్ని స్టిమ్యులేటర్‌తో నడుపుతున్న అనుభూతిని కల్పిస్తున్నారు.
- వెల్డింగ్ ట్రేడులో ఒక్కో విద్యార్థి కోసం ఏడాదికి 400 రూపాయలు చొప్పున పలు పరికరాల కోసం ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు వెల్డింగ్ స్టిమ్యులేటర్ మంజూరు కావడంతో ఆ సమస్యను అధిగమించినట్లయింది. శిక్షణ కోసం ఖర్చును భారీగా తగ్గించగలిగారు. వీటితో పాటు లేటెస్ట్ కాన్ఫిగ్యురేషన్‌తో 45 కంప్యూటర్లను మంజూరు చేశారు.
- గతంలో లైబ్రరీ జాడ ఉండేది కాదు. అన్ని రకాల కోర్సులకు సంబంధించి 1600 పుస్తకాలను విద్యార్థులకు అందుబాటు లోకి తెచ్చారు. లైబ్రేరియన్‌ను నియమించా రు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకా లను నిబంధనల ప్రకారం అంద జేస్తున్నారు.
- రెండేళ్ల ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మిషనిస్టు, మోటా రు మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ మెకానిక్, ఏడాది కోర్సు కింద టర్నరు, డీజిల్ మెకానిక్ ట్రేడులలో 446 మంది విద్యార్థుల చొప్పున శిక్షణ పొందుతుండేవారు. ఇప్పుడు అదనపు కోర్సులు రావడంతో మరింత మంది పెరిగే అవకాశం ఉంది.


స్టిమ్యులేటర్‌తో తరగతులు

నేటి డిమాండ్‌కు తగ్గట్టుగా హంగులు..

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఐటీఐలో అనేక కొత్త కోర్సులను ఏర్పాటు చేశాం. రూ.1.50 కోట్లతో ఆధునిక పరికరాలను సమకూర్చాం. వర్చువల్, ఏఆర్ ల్యాబ్‌లు, స్టిమ్యులేటర్స్, అధునాతన కంప్యూటర్లను, గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాం. వసతుల కొరత ఉన్న కారణంగా 15 తరగతి గదులనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. వర్క్‌షాపును ఆధునీకరించాల్సి ఉంది. హాస్టళ్ల గదులు శిథిలమైపోయాయి. రెగ్యులర్ ఉద్యోగులు 23 మంది, కాంట్రాక్టు ఉద్యోగులు ఆరుగురు పనిచేస్తున్నారు. మరో పది మంది సిబ్బంది అవసరం ఉంది. వర్చ్యువల్ ల్యాబ్ ద్వారా రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చింది. డ్రోన్ టెక్నాలజీ, కంప్యూటర్, కుట్టుశిక్షణా కోర్సులు మంజూరయ్యాయి. వాటన్నింటినీ ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది.

-జీవీ రమణరావు, ప్రిన్సిపాల్, బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐ



వసతులు కల్పించని గత ప్రభుత్వం..

చారిత్రాత్మకమైన బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐని అప్‌గ్రేడ్ చేసేందుకు గత ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయలేదు. హంగులున్నా వసతుల మాట పూర్తిగా మరిచిపోయింది. ఐటీఐ నిర్వహణకు అత్యంత ముఖ్యమైనది వర్క్‌షాపు. ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరింది. తరగతి గదులు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. విద్యార్థుల వసతి గృహాలు పొదలతో వృథాగా పడి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రావడంతో పరిస్థితి మారుతుందని విద్యార్థులు ఆశతో ఉన్నారు.


అన్ని హంగులతో కంప్యూటర్ క్లాసులు


పోస్టర్ విడుదల చేసిన యువకులు

రక్తదానానికి మేము సైతం

- ముందుకొచ్చిన మెంటాడ యువత
- క్విక్ దోనర్ యాప్ పోస్టర్ విడుదల

మెంటాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల్లో రక్తం అందక చాలా మంది ప్రాణాపాయాన్ని ఎదుర్కోవడం చూసి చలించిన మెంటాడ యువత తన వంతుగా రక్తదానానికి ముందుకొచ్చారు. ఓ యాప్‌ను రూపొందించి నిత్యం అందుబాటులో ఉంటామంటున్నారు. ఇందుకోసం 100 మంది ఒక్కటయ్యారు. తమతో పాటు కనీసం 1000 మందిని తమ గ్రూపులో కలుపుకోవాలని నిశ్చయించారు. పట్టణాలు, పల్లెలు అని తేడా లేకుండా ఆపత్కాల స్థితిలో వున్న బాధితులకు రక్తం ఇవ్వాలని నిర్ణయించారు. బాధితుని వద్దకు రక్తదాత వెళ్తాడంటున్నారు. క్విక్ డోనర్ యాప్ రూపొందించారు. ఆ యాప్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 25 నుంచి సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. కొన్నేళ్లుగా రక్తదానం చేస్తున్నామని, దాతల వివరాలు యాప్‌లో పొందుపరుస్తామన్నారు. క్విక్ డోనర్ యాప్‌లో కానీ వేరుగా తమ మొబైల్‌కు కాల్ చేసినా రక్తదాతలను పంపిస్తామన్నారు. బాధితుడికి కావాల్సిన బ్లడ్ గ్రూప్ ఉన్న వ్యక్తిని పంపిస్తామని చెప్పారు.



క్విక్ దోనర్ యాప్

సైలెన్సర్ వద్దట!



- రేస్ బైకులతో కుర్రకారు బేజారు
- ఇష్టారాజ్యంగా సైలెన్సర్ల వినియోగం
- నిబంధనలకు విరుద్ధం.. అనారోగ్యానికి కారణం
- తోటి ప్రయాణికులకు, వాహనదారులకు అసౌకర్యం



- రాజాంలో శివ అనే యువకుడు ఇటీవల బుల్లెట్ బండిని కొనుగోలు చేశాడు. అయితే కంపెనీ ఇచ్చిన సైలెన్సర్‌ను కాదని.. సొంతంగా మెకానిక్ తయారుచేసిన సైలెన్సర్‌ను అమర్చాడు. అదేమని ప్రశ్నిస్తే భారీ శబ్ధం వస్తే కదా మజా అని చెబుతున్నాడు. మనం వస్తున్నామని నలుగురికి తెలియాలి కదా అని సమర్థించుకుంటున్నాడు.
- ఇటీవల అంతర్ రాష్ట్ర ట్రావెలర్స్ కొంతమంది ఒడిశా నుంచి రాజాం మీదుగా విశాఖ వైపు వెళుతున్నారు. ఆ సమయంలో వారి బైక్‌లు రయ్ రయ్ మంటూ వేగంతో ముందుకెళుతున్నాయి. కురచగా ఉండే సైలెన్సర్ల నుంచి వస్తున్న సౌండ్ భారీగా ఉంది. రోడ్డుపై ఉండే చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఒక్కసారిగా హడలెత్తిపోయారు.
- రాజాంలో సైలెన్సర్లు మార్చే షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. గతంలో విశాఖ, విజయనగరంలో మాత్రమే ఈ సైలెన్సర్లు మార్చే షాపులు ఉండేవి. కానీ యువత అభిరుచులు గమనిస్తున్న మెకానిక్‌లు విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు ఏర్పాటుచేసి సొమ్ము చేసుకుంటున్నారు.

రాజాం, నవంబరు 3

కుర్రకారు రేస్ బైకులతో హారన్ల మోత మోగిస్తున్నారు. ద్విచక్ర వాహనాలకు అధిక శబ్దాన్నిచ్చే సైలెన్సర్లను అమర్చుతున్నారు. వీటి ధర ఎక్కువైనా లెక్క చేయడం లేదు. ఆరోగ్యానికి హానికరమని తెలిసినా.. పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నా.. పోలీసులు హెచ్చరిస్తున్నా.. బేఖాతరు చేస్తున్నారు. బైకులతో రోడ్డెక్కి తోటి వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నారు. ముఖ్యంగా కాలం చెల్లిన వాహనాలకు సైతం రంగులు అద్దుతున్నారు. సైలెన్సర్లు, ఇతర పరికరాలు అమర్చి రైడ్ చేస్తున్నారు. రోడ్లపై మితిమీరిన వేగంతో, చెవులకు చిల్లుపడే శబ్ధంతో వెళ్తున్న వాహనాలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఆ వాహనం పలానా కంపెనీ అని తెలుసుకోవడానికి వీలులేని స్థితిలో మార్చేస్తున్నారు కుర్రకారు. ముఖ్యంగా సైలెన్సర్లు (పొగ గొట్టాలు)ను మార్చి... భారీ శబ్దాలనిచ్చే వాటిని అమరుస్తున్నారు. వైల్డ్‌బోర్, కాక్‌టైల్ షార్కర్, డాల్ఫిన్, మెగాఫోన్, టెయిల్‌గన్నర్ వంటి రకరకాల పేరుతో వచ్చే ఈ సైలెన్సర్లు భారీ శబ్దాన్నిస్తాయి. రూ.10 వేల నుంచి రూ.23 వేల వరకూ వీటి ధర పలుకుతోంది. అనుసంధానంగా ఇతరత్రా పరి కరాలు అమర్చేందుకు మెకానిక్‌కు మరో రూ.3 వేల వరకూ చెల్లిం చాల్సి ఉంటుంది. వీటి ధర అధికమైనా కుర్రకారు లెక్క చేయడం లేదు. ఆరోగ్యానికి హానికరమైనా, పర్యావరణానికి విఘాతం కలిగి స్తున్నా, పోలీసులు హెచ్చరిస్తున్నా బేఖాతరు చేస్తున్నారు. వాస్తవా నికి వీటి వాడకం చట్ట విరుద్ధం. పట్టుబడితే భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుంది. కానీ కొత్త సైలెన్సర్ల నుంచి వచ్చే శబ్దానికి ఎక్కువ మంది యువత ఆకర్షితులవుతున్నారు. బైక్‌లతో రోడ్డెక్కి చుట్టు పక్కల వాహనదారుల గుండెల్లో అలజడి రేపుతున్నారు.

లేటెస్ట్ వెర్షన్‌తో..

జిల్లాలో ఇటీవల ద్విచక్ర వాహనాల అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఇందులో కళాశాల యువత కొనుగోలు చేసే రేస్ బైక్‌లే అధికం. షోరూముల్లో కొనుగోలు చేసినప్పుడు అవి సాధారణ బైక్‌లే. కానీ తరువాత వాటికి ఇష్టారాజ్యంగా విడిభాగాలను అమర్చుతున్నారు. సైలెన్సర్లతో పాటు హ్యాండిల్, వీల్స్‌ను ఆకర్షవంతంగా, తమ అభిరుచులకు అనుగుణంగా మార్చేస్తున్నారు. కాలం చెల్లిన పాత బైక్‌లను సైతం అందంగా రంగులు అద్ది రోడ్లపై తిప్పుతున్నారు. వాస్తవానికి ప్రతీ మోటారు వాహనం కంపెనీ తమ బైక్‌కు నిబంధనలకు అనుగుణంగా నిర్దీత డెసిబుల్ శబ్దాన్ని వెలువరించే నిర్దిష్ట ప్రమాణాలతో సైలెన్సర్‌ను తీర్చిదిద్దుతారు. అలాంటి డిజైన్లకే రవాణా శాఖ అనుమతిస్తుంది.

కఠిన కేసులకు అవకాశం..

ఒక వాహనం నిర్దీత డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్ద కాలుష్యం చేస్తే అది మోటారు వాహన చట్టం ప్రకారం నేరం. నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యం చేస్తే ఆ వాహనదారుడిపై ఎంవీఐ యాక్ట్ 1988 సెక్షన్ 190(2) ప్రకారం పోలీసులు కానీ రవాణా శాఖ అధికారులు కానీ కేసు నమోదు చేయవచ్చు. తొలిసారి అయితే రూ.1,000 జరిమానాతో పాటు కేసు నమోదు చేయవచ్చు. రెండోసారి పట్టుబడితే రూ.2 వేలు జరిమానాతో పాటు కఠిన చర్యలకు సిఫారసు చేయవచ్చు. మోటారు కంపెనీ ఉత్పత్తి చేసిన బైక్‌ను ఎట్టి పరిస్థితుల్లో విడి పరికరాలు మార్చకూడదు. ఇటి చట్టరీత్యా నేరం. ఒక్కోసారి కేసులు కూడా నమోదవుతాయి.

కఠిన చర్యలు..

అధిక శబ్ధం కలిగించే సైలెన్సర్లను వినియోగించడం నేరం. కళాశాల యువతే ఎక్కువగా వినియోగిస్తున్నట్టు తనిఖీల్లో తేలింది. అందుకే పిల్లల కదలికపై, వారు వినియోగించే బైక్‌లపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. ఇప్పటికైనా అధిక శబ్ధం ఇచ్చే సైలెన్సర్లను అమర్చిన వారు వాటిని తొలగించాలి. లేకుంటే జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదుచేస్తాం.

-అశోక్‌కుమార్, రాజాం

అనారోగ్య సమస్యలు..

ఎక్కువ డెసిబుల్ శబ్ధం కలిగించే సైలెన్సర్లతో అనర్థాలు అధికం. వినికిడి లోపంతో పాటు మానసిక వ్యాధులు కలుగుతాయి. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఈ శబ్ధం వింటే పెను ప్రభావం చూపుతుంది. చిరాకుతో పాటు విపరీతమైన కోపం, తలనొప్పికి సైలెన్సర్ల శబ్దాలు కారణమవుతాయి. అందుకే యువత ఇటువంటి వాటికి దూరంగా ఉండాలి.

-కోటీశ్వరరావు వైద్యుడు, రాజాం

ఓం నమశ్శివాయ

- నేడు కార్తీక మొదటి సోమవారం



విజయనగరం/సాలూరు రూరల్/సాలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హరిహరులకు ప్రీతిపాత్రమైన కార్తీక మాసం రానే వచ్చింది. మొదటి సోమవారం కావడంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ శివపూజకు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పుణ్యగిరి, విజయనగరంలోని పలు శివాలయాలు, పశుపతినాథేశ్వర స్వామి ఆలయం, ధర్మవరంలోని సన్యాసేశ్వర సామి, జయతి భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, సారిపల్లి దిబ్బేశ్వరస్వామి, వంగర సంగమేశ్వరస్వామి, బొబ్బిలి రూరల్ పెంట గ్రామంలోని నగరేశ్వర స్వామి, గంగచోళ్లపెంట శివాలయం తదితర ఆలయాలకు కార్తీక శోభ సంతరించుకుంది. సాలూరులో పురాతన పంచముఖేశ్వర స్వామి ఆలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి, నగేశ్వరస్వామి, వేంకటేశ్వర కాలనీ శివాలయం, కామాక్షి ఆలయంలో ఏకామ్రనాథ్, వెలమపేటలో కాశీవిశ్వనాథ్ ఆలయం, మండలంలో గుమ్మలకొండ, మంచాడ వలసలో గోకర్ణేశ్వరస్వామి గుహాలయాల్లో పూజలు, అభిషేకాలు, హోమాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శివాలయాలు, గుహాలయాల్లో ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పురాతన శైవ క్షేత్రాల్లో ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనానికి సర్వం సిద్ధం చేశారు. కొన్నిచోట్ల ఈ ఏడాది శివదర్శనానికి రుసుం వసూలు చేయరాదని నిర్ణయించారు. కార్తీక మాసంలో శివున్ని ఆరాధిస్తే దోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఈ నెలరోజులు సూర్యోదయానికి ముందే భక్తులు పుణ్యస్నానాలతో శివపూజను నిష్ఠగా ఆచరిస్తారు.


పంచముఖేశ్వరస్వామి

చదువుకున్న చోటే గురువుగా!


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న గణపతిరావు

జియ్యమ్మవలస, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): చదువుకున్న చోటే గురువుగా పనిచేయడం అరుదు. ఆ అదృష్టం అందరికీ వరించదు. అటువంటి అవకాశం లభించే చాలా కొద్ది మందిలో లక్కుదొర గణపతి రావు ఒకరు. ఒకప్పుడు రావాడ రామభద్ర పురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న ఆయన ప్రస్తుతం అక్కడ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. బొడ్డవలసకు చెందిన ఆయన 7నుంచి టెన్త్ వరకు (1997-2001) అదే ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. సీతంపేట ఏపీటీడబ్ల్యూ రెసిడెన్షియన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. పార్వతీపురంలో డిగ్రీ చదివారు. 2008లో యానంలో డైట్ పూర్తి చేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం దొర జమ్ములో నాలుగేళ్లు విద్యావలంటీ రుగా పనిచేశారు. ఆ తరువాత ఓపెన్ డిగ్రీ పూర్తి చేశారు. 2020-22 మధ్యలో ఎంఎస్సీ కూ డా పూర్తి చేశారు. 2013 డిసెంబర్‌లో ఐటీడీఏ ద్వారా జరిగిన సీఆర్‌టీ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికై రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు సీఆర్‌టీగా వచ్చారు. వివిధ ప్రాంతాల్లో సీఆర్‌టీగా పని చేసిన ఆయనకు 2024లో రెగ్యులర్ అయ్యింది. ఆర్ఆర్‌బీ పురంలో ఉన్న తన పూర్వ పాఠశాలకు ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు. ప్రస్తుతం విద్యార్థులకు మేథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులు చెబుతూ అక్కడే వసతి గృహ సంక్షేమాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాల ఆవరణలో విజిటబుల్ గార్డెన్ ఏర్పాటు చేసి పరిసరాలు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ విషయంలో శ్రద్ధ చూపుతున్నారు. హెచ్‌ఎం ఎన్.తిరుపతితో కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

సంతోషంగా ఉంది..



నేను చదివిన ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడిగా పనిచేయడం సంతోషంగా ఉంది. పాఠశాల రుణం తీర్చుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా.

-గణపతిరావు, వసతి గృహ సంక్షేమాధికారి, రావాడ రామభద్రపురం

బిక్కుబిక్కు మంటూ..

▸▸ శిథిలావవస్థలో పాఠశాల భవనం ▸▸ పెచ్చులూడుతుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
▸▸ తాత్కాలికంగా ఓ చిన్న ఇంటిని సమకూర్చిన గ్రామస్థులు



శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

సంతకవిటి, నవంబరు3,(ఆంధ్రజ్యోతి): మండలంలో బూరాడపేట గ్రామంలో సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన మండల ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 22 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు. అక్కడి వరండాలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. కానీ వరండా, తరగతిగది శ్లాబ్‌లో పెచ్చులూడి పడిపోతున్నాయి. ఏ సమయంలో ఎక్కడ పెచ్చులు మీద పడతాయోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో శ్లాబ్ నుంచి నీరు కారుతూ తరగతి గదుల్లోకి చేరి నిల్వ ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం గురుంచి ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించామని, అయినా ఫలితం లేకపోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు.




పాఠశాల కోసం గ్రామస్థులు సమకూర్చిన చిన్న ఇళ్లు, గదిలో ఇరుకుగా కూర్చున్న విద్యార్థులు

గ్రామస్థుల సహకారంతో..

ఇలాంటి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనంలో చదువు ప్రమాదకరమని భావించిన గ్రామస్థులు పాఠశాల కోసం గ్రామంలో ఓ చిన్న ఇంటిని సమకూర్చారు. సెప్టెంబరు 1 వ తేదీ నుంచి శిథిల పాఠశాల భవనాన్ని పూర్తిగా విడిచిపెట్టి గ్రామస్థులు సమకూర్చిన ఇంటిలోకి పాఠశాలను ఉపాధ్యాయులు మార్చారు. అక్కడే విద్యా బోధన, మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. అయినప్పటికీ ఇది చాలా చిన్న ఇళ్లు కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల, జిల్లా విద్యాశాఖాధికారులకు, జిల్లా కలెక్టర్‌కి గ్రామస్థులు ఫిర్యాదుతో కూడిన వినతిపత్రాన్ని ఇటీవలే అందజేశారు. కొత్త ప్రభుత్వంలోనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలిగించి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

విస్తృతంగా టీడీపీ సభ్యత్వ నమోదు



విజయనగరంలోని 20 వ డివిజన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



చీపురుపల్లి: జి.ములగాంలో సభ్యత్వాలు స్వీకరిస్తున్న కార్యకర్తలు

విజయనగరం రూరల్, నవంబరు 3: (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 26న విజయనగరం నియోజకవర్గంలో ప్రారంభమైన టీడీపీ సభ్యత్వ నమోదు విస్తృతం గా సాగుతోంది. నగరంలోని 50 డివిజన్లు, మండల పరి ధిలోని 28 గ్రామాల్లో టీడీ పీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు గురించి వివరిస్తున్నారు. ఇప్పటికే టీడీపీ డివిజన్, గ్రామ కమిటీల నాయకులు, కార్యకర్తలు, తమ కుటుంబ సభ్యులతో సహా తమ క్రియాశీలక గుర్తింపును రెన్యువల్ చేసుకున్నారు. ఇప్పుడు తటస్థులు, టీడీపీ సభ్యత్వం కోసం ఆసక్తి చూపించేవారి విషయంలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్ళి 2024 నుంచి 2026 వరకూ సభ్యత్వం రెన్యువల్ చేసుకోవాలని కోరుతున్నారు. విజయన గరం నియోజకవర్గంలో గత వారం రోజులుగా 25 శాతం సభ్యత్వ నమోదు జరిగినట్టు సమాచారం. ఆదివారం నగరంలోని 2, 3, 4, 5, 7, 13, 20, 41, 48, డివిజన్ల పరిధి లోని పలు ప్రాంతాల టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని నగర పార్టీ అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారుబాబుతో పాటు నగరపార్టీ నాయకులు, మండల పరిధిలోని మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు తదితరులు వేగవంతం చేస్తున్నారు.

చీపురుపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గ్రామాల్లో జోరుగా సాగుతోందని మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు తెలిపారు. మండలంలోని జి. ములగాం, పీకే పాలవలస, భైరెడ్డిపేట, రావివలస, పైలపేట, పుర్రేయవలస తదితర గ్రామాల్లో ఇప్పటి వరకూ స్థానిక నాయకుల సహకారంతో 655 మందిని సభ్యులుగా చేర్పించారు. మండలంలో 15 వేల మందిని చేర్పించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆయా నాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు.

కొత్తవలస, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గంలోని అన్ని నియోజక వర్గాలలోను తెలుగుదేశంపార్టీ సభ్యత్వ నమోదుకు అనూహ్యమైన స్పందన వస్తోందని ఈ పార్లమెంటరీ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు తెలిపారు. ఆదివారం కొత్తవలసలో ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రజలు కూడా సభ్యత్వ నమోదు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. గతంలో సభ్యత్వ నమోదు కోసం అవగాహన కల్పించవలసి వచ్చేదని ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదని, గ్రామాల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ విధ్వంస పాలన చూసిన ప్రజలు ప్రస్తుత పాలనలో ఊపిరి పీల్చుకుంటున్నారన్నారు. గ్రామాలలో నాయకుల వద్దకు ప్రజలు వెళ్లి తమ పేర్లను నమోదు చేయాలని కోరుతున్నారన్నారు.

జనసేనలో పలువురి చేరిక



జనసేన పార్టీలో చేరిన వారితో జనసైనికులు

విజయనగరం దాసన్నపేట, నవంబరు3(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన నాయకులు అవనాపు విక్రమ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. వీరిని పార్టీ కండువాలతో సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఉమామల్లిఖార్జునరావు, నర్సింహమూర్తి, సీహెచ్ వెంకటేశ్వరరావు, బొమ్మన పాపారావు, వంగపండు కృష్ణ, భాస్కరరావు, పైడి రాజు, జర్జాపు ఈశ్వరరావు, పిట్టా అప్పన్నతో పాటు 30 కుటుంబాలు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఉన్నత ఆశయాలు కలిగిన వ్యక్తి అని, ఆయన నాయకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జనసేనను మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పిడుగు సతీష్, వెంకట రావు, సంపత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

17న బాలబాలికల సినీనృత్య పోటీలు

బొబ్బిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల17న స్థానిక కళాభారతి ఆడిటోరియంలో బాలబాలికలకు సినీ నృత్యాల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆనందో బ్రహ్మ కళాసంస్థ అధ్యక్షుడు మింది విజయమోహన్ తెలిపారు. స్థానిక కళాభారతిలో ఆదివారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను శ్రీకళాభారతి ప్రధాన కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు విడుదల చేశారు. మూడు నుంచి పదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మూడు విభాగాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 94407 44741 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు. సంస్థ ప్రతినిధులు పుల్లెల శ్రీనివాసరావు, డీవీ అప్పారావు, భవాని, కమల్ కుమార్, కొండలరావు, అప్పలనాయుడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నైపుణ్య శిక్షణపై అవగాహన

మక్కువ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏఎన్ఎంలు, వ్యవసాయశాఖ సహాయకులకు మినహాయించి మిగిలిన పింఛన్ పంపిణీ అధికారులకు సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డీడీ స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సిబ్బంది విధిగా హాజరు కావాలన్నారు.

కేజీబీవీల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విధుల్లో తొలగించిన కెజీబీవీల్లో సిబ్బందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఎపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 127 మంది గెస్ట్ లెక్చరర్‌లు, సీఆర్‌టీలను విధుల్లోంచి తొలగించిందని జిల్లాలో 20 మంది ఉన్నారన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీల్లో నూతనంగా సిబ్బందిని విధుల్లోకి తీసుకునేందుకు తగిన పరీక్షలు నిర్వహించిందన్నారు.

సంకిలి శివాలయానికి కార్తీకశోభ

రేగిడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో సంకిలి కాశీవిశ్వేశ్వర ఆలయానికి కార్తీక శోభ కనిపిస్తుంది. తొలి సోమవారానికి ఆలయకమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయాన్ని సర్వసుందరంగా తీర్చిదిద్దటమే కాక, ఆలయం ప్రాంగణంలో కొత్తగా ఎరాటుచేసిన బారీ శివలింగం దర్శనానికి భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

సీఎంను కలిసిన సుధారాణి



సీఎం చంద్రబాబు నాయుడుతో సుధారాణి

శృంగవరపుకోట, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆదివారం విశాఖపట్టణంలో శృంగవరపుకోట మండలానికి చెందిన రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ రాజకీయ, స్థానిక సమస్యలను వివరించినట్లు ఈమె వర్గీయులు తెలిపారు.

ఆశయ రమణ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



రమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆశయ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత రెడ్డి రమణ కుటుంబాన్ని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదివారం పరామర్శించారు. గత నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందిన రమణ గత నెల 27న మరణించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే జి.అగ్రహారంలోని రమణ ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. సుమారు రెండు దశాబ్దాల పాటు సమాజానికి రమణ చేసిన సేవల్ని ఆయన ప్రస్తావించారు. కుటుంబానికి సాయంగా ఉంటామన్నారు. టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, రెడ్డి లక్ష్మణరావు, పతివాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు డోల నాగరాజు, జనసేన ఇన్ చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ, బీజేపీ ఇన్‌చార్జి ఇప్పిలి నీలకంఠం, మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు రమణ కుటుంబాన్ని పరామర్శించారు.

నాదెండ్లను కలసిన సన్యాసినాయుడు



మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన జనసేన నేత సన్యాసినాయుడు

శృంగవరపుకోట, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): భోగాపురం వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆదివారం శృం గవర పుకోట నియోజకవర్గ జనసేన నేత ఒబ్బిన సన్యాసినాయుడు మర్యా ద పూర్వకంగా కలిశారు. ఇతనితో కలిపి వచ్చిన ఆర్టీసీ ఉద్యోగి కోలా సత్తిబాబు ఉద్యోగుల సమస్యలను వివరించారు. వినతి పత్రం అందించారు. తిమిడి ఉన్నత పాఠశాల మైదానం ఆక్రమణల నుంచి కాపాడాలని ఆగ్రామ నాయకులు ఒబ్బిన సతీష్ విన్నవించారు.

ఎలా.. వెళ్లేది మహాప్రభో



అధ్వానంగా ఉన్న పూల్‌బాగ్-సారిపల్లి రోడ్డు

విజయనగరం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని పూల్‌బాగ్ శివారు నుంచి పారిశ్రామికవాడ మీదుగా సారిపల్లికి వెళ్లే రహదారి పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారిందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూల్‌బాగ్ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డు మధ్యలో అనేకచోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారిలో పారిశ్రామికవాడ, పోలీసు శిక్షణ కళాశాల, అనేక నివాస సముదాయాలు ఉండడంతో చిన్న చిన్న వాహనాలతోపాటు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతోపాటు విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనూమానాస్పదంగా హోంగార్డు మృతి



అప్పలనాయుడు (ఫైల్)

వంగర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పదంగా హోంగార్డు మృతి చెంది న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం శివ్వాంకు చెందిన పొదిలాపు అప్పలనా యుడు(54) శ్రీకాకుళంలో హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన గత వారం రోజులుగా విధులకు హాజరుకాకుండా గ్రామంలోనే ఉంటున్నాడు. ఇదే క్ర మంలో శనివారం రాత్రి మడ్డువలస రిజర్వాయర్ గట్టుపైకి చేరుకుని అక్కడే నిద్ర పోయాడు. ఈ సమయంలో రిజర్వాయర్ గట్టుపై నుంచి జారి కిందకి పడి మృతి చెందాడు. ఆదివారం అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు స మాచారం అందించారు. దీంతో ఎస్సై షేక్ శంకర్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరు కుని మృతదేహాన్ని రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనం తరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతిడి భార్య భారతి అంగన్‌వాడి టీచర్ కాగా కుమార్తెకు వివాహమైంది. కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. మృతిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

సాలూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంటకోతకు వెళ్లిన రైతుకూలీ పాముకాటుతో మృతిచెందిన ఘటన శివరాంపురంలో ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శివరాంపురం గ్రామానికి చెందిన అల్లు రమేష్(35) కొద్ది రోజుల కిందట పంట కోత కోసే మిషన్ కొనుగోలు చేశాడు. ఆ మిషన్‌తో పంట కోత కోస్తుండగా పాముకాటు వేసింది. దీంతో అతను కొద్దిదూరం నడిచి వెళ్తూ స్పృహ తప్పాడు. అతనిని చూసిన స్థానికులు హుటాహుటిన సాలూరు ఏరియా ఆసు పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తల్లి చి న్నమ్మ, భార్య భవాని, కుమార్తె స్పందన, కుమారుడు ఉమామహేశ్వరరావు ఉన్నారు.

భార్య, కుమార్తె తప్పిపోయారంటూ ఫిర్యాదు

భోగాపుర, నవంబరు3(ఆంధ్రజ్యోతి): భార్య, కుమార్తె తప్పిపోయారంటూ రావాడ గ్రామానికి చెందిన ఉప్పాడ సన్యాసిరెడ్డి ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ పాపారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రావాడ గ్రామానికి చెందిన ఉప్పాడ సన్యాసిరెడ్డికి, అవ్వపేటకు చెందిన అవ్వ చిట్టెమ్మకు సుమారు ఎనిమిది ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఐదేళ్ల వయస్సుగల యశస్విని అనే పాప ఉంది. అయితే భార్యాభర్తల మధ్య గత కొన్ని రోజులుగా మనస్పర్థలు వస్తున్నాయి. దీంతో ఈనెల 2వ తేదీన భార్య, కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయారు. వారి కోసం సన్యాసిరెడ్డి ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసి, సీఐ ఎస్వీ ప్రభాకర్ సూచనల మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఐ రాజశ్రీ

విజయనగరం క్రైం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మెరకముడిదాం మండలం బాడాం గ్రామ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శనపతి రాముని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 46 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్సుమెంటు ఎస్ఐ సీహెచ్ రాజశ్రీ ఆదివారం తెలిపారు. నిందితుడిని తదుపరి చర్యల నిమిత్తం చీపురుపల్లి ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీ సుదర్శనకుమార్, కానిస్టేబుల్స్ రాము, జనార్దన్‌రావు పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత

గజపతినగరం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.గుమడాం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న బెల్టు నిర్వాహకుడిపై దాడి చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ జనార్దనరావు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన కాపారవు అప్పలనాయుడు మద్యం అమ్మకాలు చేపట్టినట్లు అందిన సమాచారం మేరకు దాడి చేయగా 20 సీసాలు దొరికాయన్నారు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమెదు చేసినట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాడంగి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వైసీపీ నాయకుడు ముగడ వెంకటరమణ కాలికి బలమైన గాయం కావడంతో ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. జడ్పీటీసీ పెద్దంటి రామారావు, వైసీపీ నాయకులు లక్ష్మంనాయుడు, శంకరరావు, సింహాచలం, తిరుపతి ఉన్నారు.

పీడీఎఫ్ బియ్యం పట్టివేత

మెంటాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటోలో తరలిపోతున్న పీడీఎఫ్ బియ్యాన్ని కొంపంగి బ్రిడ్జి వద్ద ఆంధ్ర ఎస్ఐ సీతారాం ఆదివారం పట్టుకున్నారు. బియ్యాన్ని, ఆటోను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 16, 17 తేదీల్లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పదో జిల్లా మహాసభలను కార్మికులు, మేధావులు, పార్టీ నాయకులు హాజరై, జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పిలు పునిచ్చారు. ఆదివారం నగరంలోని పూల్‌బాగ్, ఉడాకాలనీ, తోటపాలెం, పార్టీ నాయకులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, కరపత్రా లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి ప్రత్యేక హో దా, విభజన హామీలు, విశాఖస్టీల్ ప్లాంటు పరిరక్షణకు పోరాడిన సీపీఎంను ఆదరించాలన్నారు. కమిటీ సభ్యులు రమణమ్మ, జగన్మో హన్, బి.రమణ, రామచంద్రరావు, లక్ష్మీ, కరు ణ, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కార్తీక వన సమారాధన

శృంగవరపుకోట రూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర గ్రామం లో ఆర్యవైశ్య వన సమారాధన కార్యక్రమం ఆదివారం జరిగింది. సంఘ అధ్యక్ష, కార్య దర్శులు కందుకూరి రమేష్, పూసర్ల రవికుమార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యకుల దేవత శ్రీ వాసవీ కన్యకపరమేశ్వరికి పూజలు చేశారు. కార్తీకమాసం మొదటి ఆదివారం కావడం తో వందలాదిగా ఆర్యవైశ్య కుటుంబాలు ఈ వన సమరాధనలో పాల్గొని కార్తీక భోజనాలు చేశాయి.

న్యూస్ బాక్స్

పర్యాటకుల సందడి



సీతంపేట రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలోని పర్యాటక కేంద్రాలైన ఆదలి వ్యూ పాయింట్, మెట్టుగూడ జలపాతం, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌కు ఆదివారం పర్యాటకుల తాకిడి ఎక్కువయ్యింది. కార్తీకమాసం మొదటి ఆదివారం కావడంతో పర్యాటకుల సందడి నెలకొంది. పార్క్‌లోని సాహసోపేతమైన క్రీడలైన హ్యాంగింగ్ బ్రిడ్జి, 5డీ థియేటర్, షూటింగ్, కాయాకింగ్, బోటింగ్ వంటి క్రీడల్లో పర్యాటకులు పాల్గొని ఆనందంగా గడిపారు. పార్క్‌లో మహిళలు, చిన్నారుల సందడి కనిపించింది.

సంకిలిలో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష

రేగిడి, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): మండలంలో సంకిలి హైస్కూల్‌లో ఆదివారం మండల స్థాయి గణిత టాలెంట్ టెస్టు నిర్వహించారు. సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో లక్ష్మీపురం, అంబఖండి, రేగిడి, సంకిలి హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రామినాయుడు తెలిపారు.

రక్తదానం చేయండి

గజపతినగరం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుకావాలని మాజీ మంత్రి, జనసేన పీఏసీ నాయకులు పడాల అరుణ పిలుపునిచ్చారు. ఆదివారం వారియర్ ఫౌండేషన్ దాసరి రూపొందించిన క్విక్ డోనర్ అనే యాప్‌కు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాప్‌ను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించే దిశగా యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మునకాల జగన్, తాళ్లపూడి సావిత్రి, సనపతి శివాజీ, జాడ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

11న మండల సమావేశం

వంగర, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 11న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో త్రినాథరావు తెలిపారు. ఎంపీపీ సురేష్‌కుమార్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

వృద్ధాశ్రమానికి రూ.10 వేలు

చీపురుపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగిడిపేటకు చెందిన పాతిన శంకర్రావు, ఇందు దంపతులు బాపూజీ వృద్ధాశ్రమానికి 10 వేలు విరాళంగా ఇచ్చారు. తమ కుమార్తె హర్విక పుట్టిన రోజును పురస్కరించుకుని, వారు ఈ విరాళాన్ని ఆశ్రమ నిర్వహకుడు కోట్ల లక్ష్మణరావుకు అందజేసినట్టు తెలిపారు.

ఒంటరి వృద్ధులకు సాయం

కొత్తవలస, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి వినాయక నగర్‌లో ఉన్న ఫర్ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒంటరిగా నివాసం ఉంటున్న 43 మంది వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. జనసేన నాయకులు రామదుర్గ దంపతులు 120 కిలోల బియ్యం, మనోజ్ కుమార్ 10 వేల రూపాయలు, రిటైర్డు రైల్వే ఉద్యోగి రమణ సాయంతో వీటిని అందచేసినట్టు ట్రస్టు ఛైర్మన్ వి. హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రామదాసు, జిన్నలశ్రీను, ట్రస్టు సభ్యులు శ్రావణ్‌కుమార్, గోవిందరావు, నగేష్, మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

నేడు పాల ఉత్పత్తిదారుల సమస్యలపై సమావేశం

శృంగవరపుకోట, నవంబరు3(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 11 గంటలకు పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారానికి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీఐటీయూ అనుబంద సంస్థ ఏపీ పాల రైతుల సంఘం నాయకుడు మద్దిల రమణ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు, పాల రైతు, సంఘ సభ్యులు చర్చలో పాల్గొనేందుకు రావాలని కోరారు. రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ, పాల రైతుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బుద్ద రాజు రాంబాబు తదితరులు పాల్గొంటారన్నారు.

విద్యార్థులు కంప్యూటర్ బేసిక్స్ నేర్చుకోవాలి

బాడంగి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి ఆర్.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు, ఆటలు ఆడించడం వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పిల్లలకు కంప్యూటర్ బేసిక్స్ నేర్పించినట్టు తెలిపారు. గ్రంథాలయంలో పలు పత్రికల దినపత్రికలతో పాటు పోటీ పరీక్షలకు అవసర మైన పుస్తకాలు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఆన్‌లైన్ సమాచారం తెలుసుకునేందుకు ఇంటర్‌నెట్ సౌకర్యం కూడా కల్పించామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్థానిక సంస్థల్లో ఎవరి బలమెంత?

(5వ పేజీ తరువాయి)

ప్రచారం జరుగుతోంది. వైసీపీ ఇలా దూకుడుగా వ్యవరిస్తుంటే, కూటమి పార్టీలు మాత్రం స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక కోసం పెదవి విప్పడం లేదు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున స్థానిక సంస్థల ఓటర్ల వివరాలను సేకరించి పార్టీ అధిష్టానానికి పంపించినట్లు తెలిసింది. స్పందన కోసం ఎదురు చూస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలకు చెందిన నేతలతో ఈ విషయమై చర్చించేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సోమవారం పార్టీ జిల్లా కార్యాలయానికి రానున్నారు. వీరందరు తీసుకున్న నిర్ణయాన్ని అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టిలో పెట్టిన తరువాత పోటీ చేయాలా? వద్దా అనేది తేలనుంది.

కూటమికి అనుకూలతలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వైసీపీ నుంచి స్థానికంగా వలసలు పెరిగాయి. చాలా మంది ఎంపీటీసీలు, కార్పొరేటర్‌లు, కౌన్సలర్‌లు కూటమి పార్టీల్లో చేరారు. దీంతో వైసీపీకి, కూటమికి మధ్య 223 ఓట్ల తేడా వున్నట్లు కూటమి నేతలు అంటున్నారు. ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసేందుకు నిధులను విడుదల చేసింది. దీంతో మిగిలిన వారు కూడా కూటమి పార్టీల్లోకి వచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారు. వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధులను పార్టీలో చేర్చుకొనేందుకు స్థానికంగా వున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకొని దూరం పెట్టారు. వీరంతా బహిరంగంగా, లేదంటే లోపాయికారిగానైనా కూటమి అభ్యర్థికి ఓట్లేసేందుకు సిద్ధంగా వున్నట్లు కూటమి నేతలు నమ్ముతున్నారు. దీంతో స్థానిక కూటమి నేతలు మాత్రం ఎమ్మెల్సీ అభ్యర్థిని రంగంలోకి దించాలన్న పట్టుదలతో ఉన్నారు.

మూడేళ్లుగా పోరాటం

(5వ పేజీ తరువాయి)

ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ బాగోతంలో మరిన్ని సిత్రాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉద్యోగాలు పొందిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికి కులవృత్తి తప్ప ఎటువంటి విద్యార్హతలు లేవు. అలాగే ఏపీ ఈపీ డీసీఎల్‌లో లైన్‌మెన్‌గా చేస్తున్న ఓ వ్యక్తి తమ్ముడికి ఎటువంటి శిక్షణ లేదు. అర్హతా లేదు. అయినప్పటికీ అతనికి ఉద్యోగం ఎలా వచ్చిందనేది చర్చనీయాంశంగా మారింది.

కీలక నేత బెదిరింపులు

ఉద్యమంలో క్రియాశీలంగా ఉన్న ఓ బాధిత అభ్యర్థికి జిల్లా వైసీపీలో కీలక బాధ్యతల్లో ఉన్న ఒక నాయకుడు ఫోన్‌లో దారుణంగా బెదిరించినట్టు ప్రచారంలో ఉంది. ఆందోళన ఉపసంహరించుకోకుంటే ప్రాణాలు తీస్తానని నేరుగా హెచ్చరించినట్టు తెలుస్తోంది.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

● మంత్రి సంధ్యారాణి



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి పార్టీ శ్రేణులను కోరారు. సాలూరులోని తన నివాసంలో ఆదివారం ఆమె నియోజకవర్గంలో గల నాలుగు మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, సాధికార సారథులు పార్టీ సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలని కోరారు. కేవలం వంద రూపాయలతో సభ్యత్వం తీసుకున్న కార్యకర్తకు ఎన్నో సౌకర్యాలను పార్టీ కల్పిస్తుందని అన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి రెండు లక్షలు నుంచి ఐదు లక్షలు వరకు ప్రమాద బీమా పెంచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, గుళ్ళ వేణు, పరమేష్, వెంకటరమణ, అక్కేన తిరుపతిరావు తదితరులు హాజరయ్యారు.

మా ఉద్యోగాలను రెగ్యులర్ చేయండి

సాలూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని 1998 డీఎస్సీ, ఎంటీఎస్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని సాలూరులోని తన నివాసం వద్ద కలిసి, వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ 25 ఏళ్ల సర్వీసును తాము కోల్పోయామని అన్నారు. అరకొర వేతనంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికే వెయ్యి మందికి పైగానే రిటైర్ అయ్యామని అన్నారు. ఎలాంటి పెన్షన్ సౌకర్యానికి నోచుకోక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. తమ సమస్యను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌బాబుకు తెలియజేయాలని కోరారు. వారికి న్యాయం జరిగేలా చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లి రామకృష్ణ, శంబంగి కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

గరుగుబిల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించామని చెప్పారు. అలాగే లాలాలజపతిరాయ్ జీవిత చరిత్రను చదివి వినిపించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం



మాట్లాడుతున్న తులసీదాస్

ఒడిశా

రాయగడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో మానసిక వికాసం కలుగుతుందని రాయగడ రచయితల సంఘం (రారసం) అధ్యక్షుడు టీఎస్‌ఆర్ అప్పారావు అన్నారు. ఆదివారం స్థానిక రాజ్‌భవన్ సమావేశ హాలులో నిర్వహించిన సాహితీ సమావేశంలో ఆయన మట్లాడారు. నేడు ప్రతిఒక్కరూ సోషల్ మీడియా వలలో చిక్కుకుని విలవిలలాడు తున్నారని, దీంతో మానసిక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యక్షుడు డాక్టరేట్ పతివాడ తులసీదాస్ పాల్గొని మాట్లాడారు. ఆకాశంలో మబ్బులా అమ్మభాషను ఆంగ్లభాష కమ్ముకుంటుందని అన్నారు. బీహెచ్ నాగేశ్వరరావు, టీగౌరి, ఎల్.శివకేశవరావు, మోహనరావు తదితరులు పాల్గొని స్వీయకవితలను సినీ గీతాలను వినిపించారు.

పార్కింగ్ చేసేదెక్కడ?

- రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు
- మెయిన్ రోడ్డుపై ఆటోల హవా
- స్థలాలు లేక వాహనదారుల ఇక్కట్లు



సంపత్ భవన్ - మాధవ బజార్ మధ్యలో నిత్యమూ ఇదే తంతు

రాజాం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై రాజాం రావాలంటే వాహనచోదకులు భీతిల్లుతున్నారు. తమ వాహనాన్ని ఎక్కడ పార్క్ చేయాలనే భయం వారిని వెంటాడుతోంది. చేసేదేమీలేక ఎక్కడ ఖాళీగా స్థలం కనిపిస్తే అక్కడ వాహనాన్ని పెడుతున్నారు. ఇదే సమయంలో అటుగా పోలీసులు వస్తే అంతే.. ఓ ఫొటో తీసి ఫైన్ కట్టమంటున్నారు. కొన్నిసార్లు వాహనం ప్లగ్ తీసి తమ వెంట పట్టుకుని వెళ్లిపోతున్నారు. దీంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఈ దుస్థితి రాజాంలో కొన్నేళ్లుగా నెలకొంది. అయినాసరే పార్కింగ్ స్థలాలు సమకూర్చే ఆలోచన నాయకులు, అధికారుల్లో రాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వందలాది వాహనాలు

సుమారు 13 మండలాలకు కేంద్రంగా ఉన్న రాజాంకు నిత్యం వందలాది మంది ద్విచక్ర వాహనాలతో వచ్చిపోతున్నారు. విద్య, వైద్యం, వ్యాపారం, బ్యాంకింగ్ ఇతరత్రా అవసరాల కోసం వచ్చే వారికి పార్కింగ్ ప్రధాన సమస్యగా మారుతోంది. అంబేడ్కర్ కూడలి నుంచి బొబ్బిలి జంక్షన్ వరకూ రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు నిలిపివేస్తున్నారు. శ్రీకాకుళం రోడ్డులో బ్యాంకులు, హోటళ్లు, హాస్పిటల్స్ ఎక్కువగా ఉండడంతో వందలాది వాహనాలు రోడ్డుపైనే నిలిపివేయడంతో సమస్య తీవ్రమవుతోంది. రాకపోకలకూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



ప్రతి రోజూ మెయిన్ రోడ్డుపై ఆటోల పార్కింగ్ ఇలా..

ఆటోలే ప్రధాన సమస్య

పట్టణంలో ఆటోలు ప్రధాన సమస్యగా మారుతున్నాయి. రాజాం కేంద్రంగా నిత్యం హీనపక్షంగా 500 ఆటోలు ప్రయాణీకుల్ని వారి వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆర్టీసీ కాంప్లెక్ ఎంట్రన్స్‌తో పాటు కోర్టు ప్రాంగణం నుంచి సంపత్‌భవన్ వరకూ వరుసగా పెద్దసంఖ్యలో ఆటోలు నిలిపివేయడంతో మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోతోంది. మెయిన్‌రోడ్డు నుంచి మాధవబజార్‌లోకి నడిచి వెళ్లిరావడం కూడా కష్టమవుతోంది.

కొరవడిన సమన్వయం

అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. నాయకులు పట్టించుకోకపోవడంతో పార్కింగ్ సమస్య వీరికి పట్టడం లేదు. రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, ఆర్‌అండ్‌బీ అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమన్వయంతో సమావేశం ఏర్పాటు చేసి ఏంచేస్తే కొంతమేరైనా పార్కింగ్ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్న విషయాన్ని గుర్తెరగడం లేదు.

ఆదిమ జాతి గిరిజన తెగలకు పక్కా ఇళ్లు

● పీఎం జన్మన్ పథకం కింద మంజూరు

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సవర తెగ ఆదిమ జాతి గిరిజన కులానికి చెందిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ కింద మొదటి విడతగా 758 పక్కా ఇళ్లను మంజూరు చేసినట్టు హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని సవర తెగ గిరిజనులు నివసిస్తున్న 66 గ్రామాల్లో సర్వే చేశామని, ఈ సర్వేలో 973 గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్లు అవసరమని గుర్తించామని చెప్పారు. మొదటి విడతగా 758 మంది అర్హులుగా గుర్తించి ఇళ్లను మంజూరు చేశారన్నారు. ఒక్కొక్క ఇంటికి నిర్మాణం కోసం 2 లక్షల 39 వేల రూపాయలు చొప్పున నిధులను పీఎం జన్మన్ కింద ప్రభుత్వం కేటాయిస్తుందని తెలిపారు. ఈ నెలలో మరోసారి సర్వే చేయడానికి కూడా ఐటీడీఏ పీవో ఆదేశాలు జారీ చేశారని ఆయన చెప్పారు. పీఎం జన్మన్ పథకం కింద ఆదిమ జాతి గిరిజన తెగలు అయిన సవర తెగ గిరిజనులు నివసిస్తున్న గ్రామాల్లో రహదారులు తాగునీరు, విద్య, వైద్యం, పక్కా ఇళ్ల నిర్మాణానికి పూర్తిస్థాయి సర్వే జరిగినట్టు చెప్పారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో మరో 11 గ్రామాలు కేంద్ర గ్రామాభివృద్ధి శాఖకు చెందిన లిస్టులో లేనందున ఈ గ్రామాలను కూడా పీవీటీజీ గ్రామాలుగా గుర్తించాలని ఐటీడీఏ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్‌కు లేఖ రాశారన్నారు. ఈ పథకం పూర్తిస్థాయిలో అమలైతే గిరిజన గ్రామాల్లో పూరిళ్లు కానరావని చెప్పారు.

ఘనంగా కోడి రామ్మూర్తి జయంతి



కోడి రామ్మూర్తి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

వీరఘట్టం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలియుగ భీముడిగా పేరు పొందిన కోడి రామ్మూర్తినాయుడు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తన సొంత మండలం వీరఘట్టంలోని తెలగవీధిలోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఉత్తరాంధ్ర కీర్తి ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి అన్నారు.

గర్వంగా ఉంది

కోడిరామ్మూర్తి కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఉండడం గర్వంగా ఉంది. ఆయన ఇండియన్ హెర్క్యులస్, కలియుగ భీముడు వంటి ఎన్నో బిరుదులు పొందారు. ప్రభుత్వం వీరఘట్టంలో మంచి సంస్థను స్థాపించి ఆయన పేరు పెట్టాలి.

- కోడి వెంకటరావునాయుడు, వీరఘట్టం

కాంగ్రెస్ పార్టీ కురుపాం ఇన్‌చార్జిగా చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ పార్టీ కురుపాం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అడ్డాకుల చిన్నారావును నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఉత్తర్వులు పంపారు. ఈసందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ కురుపాంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలపర్చడానికి తాను కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులను, ఇతర కార్యకర్తలను కలుస్తానని తెలిపారు.

పకడ్బందీగా రాష్ట్ర స్థాయి నాటక పోటీలు

● ఈనెల 8, 9, 10 తేదీల్లో పెదమేరంగి సెంటర్‌లో నిర్వహణ

జియ్యమ్మవలస, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద సత్యసాయి పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఈనెల 8, 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయి నాటక పోటీలు పకడ్బందీగా నిర్వహిస్తామని మేరంగి నాటక పరిషత్ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు తెలిపారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ నాటక పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. 8వ తేదీన సాయంత్రం 'మతమా? మానవత్వమా?' పేరుతో శ్రీకాకుళం జిల్లా వారితో, రైతే రాజు 'పేరు'తో హైదరాబాద్ వారితో నాటికలు ప్రదర్శిస్తామని తెలిపారు. అలాగే 9వ తేదీన సాయంత్రం గుంటూరు జిల్లా వారిచే విముక్తి పేరుతో మొదటి నాటిక, విజయనగరం జిల్లా వారితో ఎనిమిదో అడుగు పేరుతో రెండో నాటిక ప్రదర్శిస్తామన్నారు. 10వ తేదీన సాయంత్రం అభినయ ఆర్ట్స్, గుంటూరు వారితో ఇంద్ర ప్రస్థం పేరుతో మొదటి నాటిక, పులుసు పేరుతో శ్రీరౌతు అప్పలనాయుడు కల్చరల్ ట్రస్ట్, పెదమేరంగి వారితో నాటిక ప్రదర్శిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాటక పరిషత్ ఉపాధ్యక్షులు వాన నారాయణరావు, బలగ వెంకటరమణ, ఆర్.మహేష్, ప్రధాన కార్యదర్శి రౌతు విజయ్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి ఎం.కిశోర్, కార్యదర్శులు దాసరి రాజేంద్ర, జి.రామచంద్రరావు, సహాయ కార్యదర్శి వి.అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



గరుగుబిల్లి: వేగ నియంత్రణ బోర్డును సరిచేస్తున్న పోలీసులు

సీతంపేట రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాలకొండ-హడ్డుబంగి రహదారిపై ప్రమాదాల నివారణకు స్థానిక ఎస్ఐ అమ్మన్నరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆదివారం కుసిమి జంక్షన్ సమీపంలోని మలుపు వద్ద రహదారికి ఇరువైపుల ఉన్న తుప్పలను జేసీబీ సహాయంతో తొలగించారు. దీంతో పాటు మిగిలిన ప్రదేశాల్లో ఉన్న తుప్పలను తొలగించి జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఈసందర్భంగా వాహన చోదకులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గురుమూర్తి, సిబ్బంది ఉన్నారు. ● గరుగుబిల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఉల్లిభద్ర జంక్షన్ నుంచి గరుగుబిల్లి వరకు పోలీస్ సిబ్బంది శ్రమదానంతో పిచ్చిమొక్కలు తొలగించారు. వేగ నియంత్రణ బోర్డులను సరిచేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



కురుపాం రూరల్: కిచ్చాడలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

గరుగుబిల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలతో సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం తులసిరామినాయుడువలస రహదారి జంక్షన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. అలాగే యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● కురుపాం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిచ్చాడ, వెంకటాపురం గ్రామాలను కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూరిపాకలోనే మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు



ఇదే ఎల్విన్‌పేట చెక్‌పోస్టు

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కురుపాం మార్కెట్ కమిటీకి చెందిన ఎల్విన్‌పేట చెక్‌పోస్టు సిబ్బందికి నిలువ నీడ లేకుండా పోయింది. వీరు గేటు పక్కన చిన్నపాక వేసుకొని అందులో కాలక్షేపం చేస్తున్నారు. వర్షం వస్తే చాలు వీరు వేరే ప్రాంతానికి వెళ్లి తలదాచుకున్న పరిస్థితి ఉంది. గత 15 నెలలుగా ఎల్విన్‌పేట చెక్‌పోస్టులో వ్యవసాయ సరుకుల రవాణాపై రుసుం వసూలు చేస్తున్నారు. ఆదాయం కూడా బాగానే ఉంది. అయినా ఈ చెక్‌పోస్టు సిబ్బందికి పక్కా షెడ్ వేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూరిపాకలో నిర్వహిస్తున్న ఈ చెక్‌పోస్టు స్థానంలో సిబ్బంది కోసం పక్కా షెడ్ నిర్మిస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బహుళ పంటల పరిశీలన

సాలూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లిలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న బహుళ(ఎనిమిది రకాలు) పంటలను ప్రకృతి వ్యవసాయ ఆర్‌ఎల్ కె.ప్రకాశ్ ఆదివారం పరిశీలించారు. మామిడిపల్లిలో రైతు సువ్వాడ గణేష్ ఐదు ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్, వక్క, కొబ్బరి, వంగ, మిరప, బంతి, టమాటా, కొమ్ము శనగ, బొప్పాయి పంటలను సాగు చేస్తుండడం విశేషమన్నారు. చీడపీడల నివారణకు జీవామృతం, వివిధ రకాల కషాయాలు రైతే తయారు చేసుకోవడం పట్ల ఆనందాయకం అన్నారు. గణేష్ స్ఫూర్తిగా మిగిలిన రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని ఆయన కోరారు. ఆయనతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

● వెంకటరమణ, ఎంపీడీవో, వీరఘట్టం



వీరఘట్టం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిశుధ్యం, తాగునీటి వనరులపై దృష్టి సారిస్తానని, పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తానని ఎంపీడీవో బెందాళం వెంకటరమణ తెలిపారు.

ప్రశ్న: తాగునీటి వనరుల నిర్వహణ ఎలా ఉంది?

ఎంపీడీవో: మండలంలో పంచాయతీరాజ్ డైరెక్టర్, కలెక్టర్ ఆదేశాల మేరకు తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేస్తున్నాం. నీటి పరీక్షలు జరిపి పీఆర్‌వన్ యాప్‌లో నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: పారిశుధ్య నిర్వహణకు తీసుకుంటున్న ప్రణాళికలు?

ఎంపీడీవో: మండలంలో 34 పంచాయతీల్లోని పారిశుధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. వీధుల్లోని మురుగు కాలువలను శుభ్రపరిచి, ప్రజలకు వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ ఎలా ఉంది?

ఎంపీడీవో: మండలంలో 34 పంచాయతీలకు 16 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన పంచాయతీల్లో కూడా నిర్మాణాలు పూర్తి అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రణాళికలు రచిస్తున్నాం.

ప్రశ్న: మండల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు?

ఎంపీడీవో: స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, కలెక్టర్, అధికారులు, నాయకులు సహకారంతో మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

ఘనంగా ప్రపంచ గృహిణుల దినోత్సవం

రాజాం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలోని నరసింహనాయుడు కాలనీలో ప్రపంచ గృహిణుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తల్లులను కుర్చీలపై కూర్చుండబెట్టి చిన్నారులు నేలమీద కూర్చుని భక్తి శ్రద్ధలతో పాదాలు కడిగారు. అనంతరం పిల్లలు వారి తల్లి పాదాలను పుష్పాలతో పూజించారు. కొందరు పిల్లలు తల్లులకు చిరు బహుమతులను అందజేశారు. తమ బిడ్డలు తల్లి మీద ప్రేమ, గౌరవం, భక్తితో పూజలు చేయడం చాలా సంతోషాన్నిస్తుందని చిన్నారుల తల్లులు తెలిపారు.